సాక్షి ఒడిశా

శుక్రవారం । 10 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,40,401లు, బంగారం 2 గ్రాముల 400 మిల్లీగ్రాములు, వెండి 89 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మరో ఇద్దరు అరెస్టు

రసూల్‌గఢ్ హత్య కేసులో మరో ఇద్దరు అరెస్టయ్యారు. పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

- IIలో ▸



ఘనంగా వార్షికోత్సవం

ఉపాధ్యాయ సంఘ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ టీచర్‌ను సత్కరించారు.

- IIలో ▸

న్యూస్‌రీల్

స్ట్రా బెర్రీ సాగు పరిశీలన



రైతులకు స్ట్రా బెర్రీ సాగును చూపిస్తున్న దృశ్యం

రాయగడ: పొరుగు జిల్లా గజపతికి చెందిన మోహన, గోషాణి, కాశీనగర్, గుమ్మ సమితులకు చెందిన రైతులు రాయగడ జిల్లాలోని రామనగుడలో సాగవుతున్న స్ట్రా బెర్రీ, గులాబీ, డ్రాగన్ ఫ్రూట్ వంటి లాభదాయకమైన పంటలను గురువారం పరిశీలించారు. రామనగుడ బీడీవో ప్రద్యుమ్న మండల్ రైతులకు ఈ మేరకు ఈ సాగుపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు కలిగిన వాణిజ్య పంటల్లో భాగంగా స్ట్రా బెర్రీ , డ్రాగన్ ఫ్రూట్ వంటివి రైతుల ఆర్థిక పురోగతికి ఎంతగానో దోహదపడతాయన్నారు. రైతులు తగిన మెలకువలు తెలుసుకుంటూ లాభసాటి వ్యవసాయాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన వీటిని సాగుచేయాలని సూచించారు. ఈ క్రమంలో రైతులు ఇక్కడి పంటలను చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

రాయగడ: జిల్లాలోని జిమిడిపేట సమీపంలో రాజహంస వద్ద విశాఖపట్నం నుంచి రాయిపూర్‌కు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. గురువారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి లారీ డ్రైవరు సంఘటన స్థలం నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న శిఖిఖాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చేరుకుని దర్యాప్తు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

రాష్ట్రపతి ఆగమనం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలికిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్, గవర్నర్ హరిబాబు

భువనేశ్వర్: ప్రవాసీ భారతీయ దివస్ వేడుకల్లో పాలుపంచుకునేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రానికి చేరారు. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆమెకి పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా స్వాగతించారు. ముఖ్యమంత్రితో రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరిబాబు కంభంపాటి కూడా హాజరై రాష్ట్రపతికి స్వాగతం పలికారు. శుక్రవారం ముగింపు వేడుకల్లో ఆమె ప్రసంగించనున్నారు.

నోట్లు చూపించి.. బంగారం లాగేశారు



బంగారు నగలు పోగొట్టుకున్న రైతు మహేశ్వర బెహర

జయపురం: పట్టణంలో రోజురోజుకు నేరాలు పెరుగుతున్నాయి. గురువారం ఒక రైతు దారిలో పోతుండగా దుండగుల ఆ మార్గంలో కరెన్సీ న ఓట్లు వేసి రైతును ఏమార్చి బంగారు నగలు దోచుకుపోయారు. జయపురం సమితి ఉమ్మిరి గ్రామం సమీప 26వ జాతీయ రహదారిలో ఒక రైతు దొంగల బారిన పడ్డాడు. అతడు పుత్ర గ్రామానికి చెందిన మహేశ్వర బెహర. పోలీసుల వివరణ ప్రకారం.. రైతు మహేశ్వర బెహర పొలం పనులకు డబ్బు అవసరమై తన భార్య బంగారు నగలు జయపురం యూనియన్ బ్యాంక్‌లో కుదవ పెట్టాడు. గురువారం భార్య నగలు విడిపించేందుకు జయపురం యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి డబ్బు జమ చేసి నగలు విడిపించి నగలు బ్యాగ్‌లో పెట్టి మధ్యాహ్నం బైక్‌లో బయల్దేరాడు. ఉమ్మిరి గ్రామం సమీపం 26వ జాతీయ రహదారిలో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చారు. తర్వాత మరో యువకుడు మరో బైక్‌పై వస్తూ రోడ్డుపై డబ్బులు పడిపోయాయని రైతుకు తెలిపాడు. తన డబ్బులు పడిపోయాయో ఏమోనని భమలో రైతు బైక్ స్లో చేస్తూ చూడగా 10, 20 రూపాయల నోట్లు కనిపించాయి. వాటిని చూస్తూ ఉండగా దుండగులు బైక్ హ్యాండిల్‌కు తగిలించి ఉన్న నగల బ్యాగ్‌ను తీసుకుపోయారు. ఈ నగల విలువ రూ.2.30 లక్షలు ఉంటుందని రైతు తెలిపాడు. వెంటనే ఆయన జయపురం సదర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

భవిష్యత్ యుద్ధంలో కాదు.. బుద్ధునిలో ఉంది



18వ ప్రవాస భారతీయ దివస్ ఉత్సవ వేదికపై భారత ప్రధాన మంత్రితో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- ఘనంగా 18వ ప్రవాస భారతీయ దివస్

భువనేశ్వర్:

మన భవిష్యత్ యుద్ధాల్లో లేదని బుద్ధుని ఆలోచనల్లో ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతీయ విలువలను సజీవంగా ప్రతిబింబించేందుకు ప్రవాస భారతీయుల్ని ఒక వేదికపై సమాహారంగా సమావేశపరిచినట్లు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్-టొబాగో అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా కంగాలూతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 18వ ప్రవాసీ భారతీయ దివస్, నేపథ్య ప్రదర్శనలను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, అశ్విని వైష్ణవ్ మరియు ఇతర ప్రముఖ మంత్రులు పాల్గొన్నారు. మూడు సార్లు గ్రామీ అవార్డు విజేత రికీ కేజ్ ప్రదర్శనతో 18వ ప్రవాస భారతీయ దివస్ ఉత్సవం ప్రారంభమైంది. రాష్ట్రంలో ఈ ఉత్సవం నిర్వహించడం తూర్పు భారతదేశం అభివృద్ధి, సాంస్కృతిక ప్రాధాన్యతకు పట్టం గడుతుందని, నరేంద్ర మోదీ ప్రభుత్వ పూర్వోదయ విధానం ప్రాముఖ్యతని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుందని విదేశాంగ మంత్రి ఎస్.జయ శంకర్ ఉద్ఘాటించారు.

జనవరి 9 చారిత్రాత్మకం

ప్రవాస భారతీయులను స్వాగతిస్తూ, జనవరి 9కి చారిత్రాత్మకమైన ప్రాముఖ్యత కూడా ఉందని ప్రధాని మోదీ అన్నారు. మహాత్మా గాంధీ సుదీర్ఘ కాలం విదేశాల్లో గడిపిన తర్వాత 1915లో భారత దేశానికి ఇదే రోజున తిరిగి వచ్చారని గుర్తు చేశారు.



ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్ని పచ్చ జెండా ఊపి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

ఒడిశా వారసత్వాన్ని ప్రాముఖ్యపరుస్తూ ఈ భూమి భారత దేశం యొక్క గొప్ప వారసత్వానికి పట్టుగొమ్మగా పేర్కొన్నారు. ఉదయగిరి, ఖండగిరి గుహలు, కోణార్క్ ఆలయం, తామ్రలిప్తి, మాణిక్‌పట్న వంటి పురాతన నౌకాశ్రయాలు ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లని గుర్తు చేశారు. ఈ సంపద దేశానికి అపారమైన గర్వాన్ని ప్రసాదిస్తుందన్నారు. భారత దేశపు ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాముఖ్యతను వివరిస్తూ భారత దేశం కేవలం ప్రజాస్వామ్య తల్లి మాత్రమే కాదని ప్రజాస్వామ్యం మన జీవన విధానంలో పాతుకుపోయిందని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు.

ధౌలీ క్షేత్రం మహనీయం

మానవజాతి ప్రయోజనాల కోసం యుద్ధం అక్కరకు రానే రాదని, అభివృద్ధి పథంలో పయనించాల్సిన అవసరాన్ని నరేంద్ర మోదీ ప్రస్తావించారు. ఒడిశా ధౌలికి పుట్టినిల్లని, ఇది శాంతికి చిహ్నమని అన్నారు. ప్రపంచం ఒకరినొకరు కత్తులతో దూసుకున్న భయానక అమానుషకర పరిస్థితుల్లో సామ్రాట్ అశోకుని మహనీయునిగా మలిచిన అద్భుత నేలగా కొనియాడారు. ధౌలి కేంద్రంగా ఒడిశాలో 'శాంతి మరియు ధర్మం' మార్గాన్ని అశోక చక్రవర్తి ఎంచుకుని మానవీయ విలువలకు నాంది పలికాడని తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రెసిడెంట్ క్రిస్టీన్ కార్లా కంగాలూ ముఖ్య అతిథిగా చేసిన వర్చువల్ అడ్రస్‌ని ఈ సదస్సులో ప్రదర్శించారు. ప్రవాసీ తీర్థ దర్శన్ యోజన కింద ప్రత్యేక పర్యాటక రైలు అయిన ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ని ఆయన ప్రారంభించారు. వర్చువల్‌గా ఈ సేవల్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. రైలు ప్రవాస భారతీయుల్ని మూడు వారాల పాటు దేశంలోని వివిధ మతపరమైన, పర్యాటక ప్రాంతాలను చుట్టి తీసుకువస్తుందన్నారు.



భారత ప్రధాన మంత్రికి స్థానిక విమానాశ్రయంలో స్వాగతం పలికిన రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి

ఒడిశాలో పెట్టుబడులు పెట్టండి: సీఎం

భువనేశ్వర్: రాష్ట్రంలో పెట్టుబడుల్ని గణనీయంగా పెంచేందుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రవాస భారతీయుల్ని ప్రోత్సహించారు. ఒడిశాలో పెట్టుబడులు భవిష్యత్‌కు భద్రత అని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రవాస భారతీయులు ఉత్సాహంతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పిలుపునిచ్చారు.

18వ ప్రవాస భారతీయ దివస్ ప్రారంభోత్సవం పురస్కరించుకుని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరు అయిన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఒడిశా వ్యాపారానికి అనువైన ప్రదేశమని, బహుముఖ వ్యాపారాలకు ఈ రాష్ట్రంలో అద్భుతమైన అవకాశాలు నెలకొని ఉన్నాయని తెలిపారు. ఒడిశా అభివృద్ధిలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ అన్నారు. ప్రవాస భారతీయుల సదస్సుని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ పూర్వోదయ మిషన్ కార్యక్రమంలో ఒడిశా కేంద్ర బిందువుగా ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఒడిశా శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రకృతి అందాలకు కొలువై చిలికా, గోపాల్‌పూర్, షిమిలిపాల్ తదితర పర్యావరణ ప్రాధాన్యత కలిగిన పర్యాటక కేంద్రాలు ప్రపంచ ఆకర్షణగా అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. జాతీయ స్థాయిలో ఒడిశా రెండో అతి పెద్ద ఖనిజ ఉత్పత్తిదారు కావడంతో వ్యాపార రంగంలో గట్టి పట్టుని కలిగి ఉందని గుర్తు చేశారు. రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు తదితర జాతీయ, అంతర్జాతీయ రవాణా, ప్రసార రంగాలకు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. మానవ వనరులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. భారతదేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు సాధించగా ఒడిశా 2047 నాటికి 1.5 ట్రిలియన్ (1 లక్షా 50 వేల) డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవాలనే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఇప్పటి నుంచే పునాది పడనుంది. 2036లో సుసంపన్నమైన ఒడిశాను నిర్మించేందుకు అన్ని రకాల సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. ఒడిశాలో పెట్టుబడులు పెట్టడం అంటే భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టడమేనని ముఖ్యమంత్రి మోహన్ మాఝీ అన్నారు.

25 ఎకరాల్లో గంజాయి ధ్వంసం



కలిమెల సమితిలో గంజాయి సాగు



మల్కన్‌గిరి బిల్‌పూర్‌లో గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాలో రెండు చోట్ల 25 ఎకరాల్లో గంజాయి పంటను గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. బిల్‌పూర్ పంచాయతీ పరిధిలో గల గౌడిగూడ గ్రామం సమీప అడవిలో 11 ఎకరాల్లో 16,500 మొక్కలను ధ్వంసం చేశారు. అలాగే కలిమెల సమితిలో కుమ్మానూర్ పంచాయతీ కేందుగూడ గ్రామ అడవి ప్రాంతంలో 14 ఎకరాల్లో 20 వేల మొక్కలు ధ్వంసం చేశారు. పోలీసులు అధికారులు మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో, కలిమెల ఐఐసి చంద్రకాంత్ తండిలు ఇద్దరిని పట్టుకున్నారు.

నీటిలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

రాయగడ: స్థానిక చెక్కాగుడ సమీపంలోని నాగావళిలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో మృతులను శ్రీను కుమార్ యాదవ్ (11), సీహెచ్ భార్గవ్ చరణ్ (11)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు , అగ్నిమాపక సిబ్బంది మృతదేహాలను వెలికి తీసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగారు. వివరాల్లోకి వెళితే..

స్థానిక దీప్తి కాన్వెంట్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న భార్గవ్, శ్రీనులతో పాటు స్థానిక రాణిగుడఫారానికి చెందిన నమ్మాజయ్ సామంత, మరో విద్యార్థి రోప్‌వే బ్రిడ్జి వద్దకు ఆడుకునేందుకు వెళ్లారు. బాల్ ఆట ఆడుతుండగా బాల్ రోప్ వే బ్రిడ్జి కిందకి పడిపోయింది. శ్రీను, భార్గవ్ బాల్ తీసుకునేందుకు కిందకు వెళ్లారు. నదిలో పడిన బాల్‌ను తీస్తుండగా కాలుజారి భార్గవ్ నదిలో పడిపోయాడు. అతడిని కాపాడే క్రమంలో శ్రీను కూడా నదిలో దూకాడు. దీంతో ఇద్దరూ కొట్టుకుపోయి చనిపోయారు. తోటి విద్యార్థులు విషయాన్ని సమీపంలో గల వారికి చెప్పగా.. అక్కడి వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.



విద్యార్థి మృతదేహం

తరచూ ప్రమాదాలు

చెక్కగుడ నుంచి మంకొడా జోల ఆ పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మెరుగుపరిచేందుకు నాగావళి నదిపై రోప్‌వే బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ రోప్‌వే బ్రిడ్జిని సందర్శించేందుకు వచ్చిన పర్యాటకులు ఈ ప్రాంతానికి వెళ్లి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా మజ్జిగౌరి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఎంతో మంది ఇక్కడ ఫొటోలు దిగేందుకు ప్రయత్నిస్తూ ప్రాణాలు కోల్పోయారు. దీంతో జిల్లా యంత్రాంగం రెండేళ్ల కిందట రోప్ వే బ్రిడ్జిని మూసివేసింది. బ్రిడ్జి లోపలకు ప్రవేశించకుండా ప్రవేశ ద్వారాన్ని మూసివేశారు. కానీ కొందరు లోపలకు వెళ్తానే ఉన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఖోయిర్‌పూట్‌లో జిల్లా స్థాయి యువోత్సవం



విద్యార్థినుల ప్రదర్శనలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పూట్ సమితి కుడుములగుమ్మ పంచాయతీలో ఉన్న డార్విన్ స్మారక డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం జిల్లాస్థాయి యువోత్సవం నిర్వహించారు. కేంద్ర యువ వ్యవహారాల శాఖ పరిధిలోలోని నెహ్రూ యువ కేంద్రం, మోయువ భారత్ యువోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నృత్య, చిత్రలేఖనం కవితల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ వేద్‌బర్ ప్రాదన్, ఖోయిర్‌పూట్ సమితి బీడీఓ ఉమాశంకర్ కోయ, జిల్లా అదనపు కలెక్టర్ అజయ్ కుమార్ మండాంగి, జిల్లా అదనపు కార్మిక అధికారి పూర్ణిమా దురుకా పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్ ప్రదన్, జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధ్యక్షుడు హరిష్ కుమార్ రూపాల్ తదితరులు హాజరయ్యారు.

కోటిన్నర విలువైన సెల్‌ఫోన్లు చోరీ



దుకాణానికి దొంగలు కన్నం వేసిన దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరిలోని ఓ మొబైల్ దుకాణంలో బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు రూ.కోటిన్నర విలువైన సెల్‌ఫోన్లు దొంగిలించారు. ఈ దుకాణం జిల్లా ప్రభుత్వాస్పత్రికి దగ్గరలోనే ఉంది. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. గురువారం దుకాణానికి యజమాని వచ్చి చూసేసరికి గోడకు కన్నం కనిపించింది. పరిశీలించగా సెల్ ఫోన్లు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐఐసీ రీగాన్‌కీండో తన సిబ్బందితో వెళ్లి కేసు నమోదు చేశారు.



చెల్లాచెదురుగా పడి ఉన్న సెల్‌ఫోన్లు వస్తువులు



ఖాళీ అయిన సెల్‌ఫోన్లు

గిరిజన గ్రామాల్లో అభివృద్ధి భేష్

- కేంద్ర క్రీడా. యువజన వ్యవహారాల మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే

పర్లాకిమిడి:

గజపతి జిల్లాలో కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల మంత్రి రక్షానిఖిల్ ఖడ్సే గురువారం ఉదయం పర్యటించారు. తొలుత హెలికాప్టర్‌లో గజపతి స్టేడియంలో దిగిన కేంద్ర మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేను గజపతి బిజేపీ పార్టీ అధ్యక్షులు కోడూరు నారాయణరావు స్వాగతం పలికారు. అనంతరం సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని అక్కడి నుంచి కేంద్ర మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే గుమ్మా బ్లాక్‌లో మునిసింగి, తరంగడ, అనుకుండగూడ గ్రామాలు చేరుకుని అక్కడ రబ్బరు ప్లాంట్‌ను సందర్శించి ఉత్పత్తిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కాఫీ పంటను పండిస్తున్న గిరిజన రైతులను ఉత్పత్తిపై అడిగి తెలుసుకున్నారు. పలు అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించారు. ముఖ్యంగా కేంద్ర ఆయుష్మాన్ ఆరోగ్య పథకం అమలుపై ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడారు. గుమ్మ ప్రాంతంలో గిరిజనులు కొండవాలు ప్రాంతంలో వరితో పాటు అరటి పంటను పండిస్తున్న తీరును చూసి సంతోషం వ్యక్తం చేశారు.



సర్క్యూట్ హౌస్‌లో కేంద్రమంత్రి రక్షా నిఖిల్‌ఖడ్సేకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే కోడూరు



కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరుపుతున్న కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే

కలెక్టరేట్‌లో సమీక్ష

అనంతరం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ అధికారులతో ఆయన పలు పనులపై సమీక్షించారు. సమావేశంలో ఎమ్మెల్యే రేపేష్ పాణిగ్రహి, కలెక్టర్ బిజయ కుమార్ దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతి రావు, రబ్బరు ప్లాంట్ మేనేజరు సనాతన శెఠి, బ్లాక్ అధికారులు, ఛైర్మన్లు ఎన్.వీ రాజు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా బయటకు వచ్చిన కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే విలేకరులతో మాట్లాడారు. గజపతి జిల్లా ఆకాంక్ష జిల్లాలో ఎంపికైన తర్వాత పథకాల అమలు బాగుందన్నారు. మరో నాలుగేళ్లలో గజపతి జిల్లాలో ఆదివాసీ ప్రాంతాలన్నీ అభివృద్ధి జరుగుతాయన్నారు. జిల్లాలో స్పోర్ట్స్ కాంప్లెక్సును నిర్మించడానికి నీతి ఆయోగ్‌తో సంప్రదిస్తానని ఆమె అన్నారు.



మునిసింగిలో రబ్బరు ప్లాంట్ ప్రాసెసింగ్‌ను పరీక్షిస్తున్న కేంద్ర మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే



గిరిజనులు పండించిన ఉత్పత్తులను చూస్తున్న కేంద్ర మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే

క్లుప్తంగా

స్టేడియాలు నిర్మించాలని వినతి



కేంద్రమంత్రికి రక్షాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో క్రీడాకారులకు అవసరమైన ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు నిర్మించాలని ఎంపీ ప్రతినిధి దారపు రాజేష్ కుమార్ కోరారు. ఈ మేరకు కేంద్ర క్రీడ, యువజన సర్వీసుల సహాయ మంత్రి రక్షా నిఖిల్‌కు సర్క్యూట్ హౌస్‌లో వినతిపత్రం గురువారం అందజేశారు. జిల్లాలో ఔత్సాహిక క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లేకపోవడంతో అనేక మంది పక్క జిల్లాలకు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శ్రీకృష్ణ చంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలలో కనీస మౌలిక సౌకర్యాలు లేని కారణంగా క్రీడాకారులు నిరుత్సాహం చెందుతున్నారని పేర్కొన్నారు.

నాటుసారా పట్టివేత



నాటుసారాతో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎక్సైజ్ సిబ్బంది 20 లీటర్ల నాటుసారాతో ఇద్దరు వ్యక్తులను గురువారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుకొండ సమితి పోట్రేల్ గ్రామ పంచాయతీలోని ఒక ఇంటి వద్ద నాటుసారా అమ్ముతున్నట్లు బలిమెల ఎక్సైజ్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఇర్మా పోడియమి అనే వ్యక్తి ఇంటిపై దాడిచేసి నాటుసారా స్వాధీనం చేసుకొని, ఇర్మా పోడియామితో పాటు ఇర్మా మాడీ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అలాగే తెంతులిగూడ గ్రామ అడవిలో మరో 80 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ సంఘం వార్షికోత్సవం



గౌరచంద్ర పండాను సన్మానిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా అఖిల ఉత్కళ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం 80వ వార్షికోత్సవాన్ని పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎస్.తిరుపతిరావు అధ్యక్షత వహించగా, కార్యదర్శి ముంగి రవి కుమార్ అతిథులను పరిచయం చేశారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయుడు గౌరచంద్ర పండాను సన్మానించారు. కార్యక్రమంలో ఒడిశా మాధ్యమిక ఉపాధ్యాయుల సంఘం (ఓస్టా) అధ్యక్షుడు పి.తిరుమలరావు పట్నాయక్, కార్యదర్శి ప్రఫుల్ల కుమార్ మహంతిలు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

పర్లాకిమిడి: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం గుండా భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించనున్నట్టు ఆలయ ప్రధాన పూజారి భద్రం కృష్ణమాచార్యులు గురువారం తెలియజేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా పోలీసు బందోబస్తుతో పాటు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ధర్మవరంలో కబడ్డీ పోటీలు

ఎచ్చెర్ల : స్వామి వివేకానందుడి 162వ జయంతి సందర్భంగా ధర్మవరంలో ఈ నెల 11, 12వ తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మేము సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు టేకి ఆచారి తెలిపారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.8వేలు, రూ.5వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 91822 54531, 8143299133 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విధి నిర్వహణలో ఆశ కార్యకర్త మృతి

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న కెంబూరి చంద్రకళ(50) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఉదయం 9 గంటల సమయంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి మందులు సరఫరా చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు సపర్యలు చేసేటప్పటికే మృతిచెందారు. ఈమె 20 ఏళ్లుగా ఆశ కార్యకర్తగా సేవలు అందించారు. విషయం తెలుసుకున్న స్థానిక వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు, ఏఎన్ఎంలు, తోటి ఆశ కార్యకర్తలు సంతాపం తెలిపారు. చంద్రకళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వంతెన, మంచినీటి ప్రాజెక్టుల పరిశీలన



ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత



నిర్మాణ నమూనాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న అధికారులు

కొరాపుట్: మురన్ నది సమీపంలో నిర్మిస్తున్న వంతెన, మెగా మంచి నీటి ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాలను లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రవిత్ర శాంత గురువారం పరిశీలించారు. దశమంతపూర్‌లో పర్యటించారు. రూ.32 కోట్లతో ఇరు జిల్లాలను కలిపే మురన్ వంతెన ప్రాంతం సందర్శించారు. సమీపంలో రూ.245 కోట్లతో 18 గ్రామ పంచాయతీల్లోని 190 గ్రామాలకు లక్ష 53 వేల 781 మందికి తాగు నీరందించే ప్రాజెక్ట్ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణానికి వినియోగిస్తున్న నాణ్యతలేని మట్టి, ఇసుకను చూసి ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణం సంబంధిత ఇంజినీర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది ప్రజలకు ఉపయోగపడే ఈ ప్రాజెక్టల నిర్మాణంలో అవకతవకలపై అసెంబ్లీలో లేవనెత్తుతానని ప్రకటించారు.

న్యాయవాది అశోక్ మిశ్రకు ఘన నివాళి



అశోక్ మిశ్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మచ్చ



సంతాప సభలో పాల్గొన్న ప్రముఖులు

జయపురం: జయపురంలో ప్రముఖ న్యాయవాది హోల్ మౌంట్ వేలీ యజమాని, సమాజ సేవకుడు, బీజేపీ నేత స్వర్గీయ అశోక్ మిశ్ర సంతాప సభ గురువారం మౌంట్ వేలీ సభాగృహంలో నిర్వహించారు. ఈ సంతాప సభలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, విశ్రాంత ఐఏఎస్ అధికారి అరుణ కుమార్ మిశ్ర, దక్షిణ ఒడిశా ఆదివాసీ మహాసంఘం అధ్యక్షుడు, అఖిల భారత భ్రష్టాచార వ్యతిరేక సంఘటన ఒడిశా కార్యదర్శి అర్జున భొత్ర, కార్యదర్శి అనిల్ కుమార్ మిశ్ర, సీనియర్ సిటిజన్ భువన మిశ్ర, పలువురు ప్రముఖులు పాల్గొని అశోక్ మిశ్ర చిత్రపటానికి నివాళులర్పించారు. అశోక్ మిశ్ర సేవలను పలువురు వక్తలు కొనియాడారు.

శిశుమందిర్‌ను ఆలయంగా భావించాలి



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: సరస్వతీ శిశుమందిరాన్ని పవిత్ర ఆలయంగా భావించి, పిల్లలకు సంస్కారంతోపాటు మానవత్య విలువలతో కూడిన గుణాత్మక విద్యను బోధించాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. గురువారం స్థానిక శారదా విహార్ సరస్వతీ విద్యామందిరం వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులదేనన్నారు. విద్యాలయ పరిచాలన కమిటీ అధ్యక్షుడు కిశోర్ చంద్ర పండా అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవంలో జయపురం తహసీల్దార్ సత్యవాది జెన, గౌరవ అతిథిగా పాల్గొన్నారు, ముఖ్యవక్తగా డాక్టర్ మనోరంజన్ ప్రదాన్ హాజరయ్యారు. ఒడిస్సీ నృత్యాలు, నాటికలతోపాటు పలు సంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విద్యాలయ యాజమాన్యం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



జాతీయ నేతల విగ్రహాలకు పూలమాలలు వేస్తున్న అతిథులు



ఒడిస్సీ నాట్య బాల కళాకారులను సన్మానిస్తున్న తారాప్రసాద్ బాహిణీపతి

పీఎం ఉషా నిధులు సకాలంలో వినియోగించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాలకు మంజూరైన పీఎం ఉషా నిధులు సకాలంలో వినియోగించాలని కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి సునీల్‌కుమార్ బర్న్వెల్ అన్నారు. ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ నిధుల వినియోగంపై దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల అధికారులతో గురువారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ వర్సిటీ వీసీ రజిని, రిజిస్ట్రార్ సుజాత హాజరయ్యారు. భవనాలు, ల్యాబ్‌లు, రీసెర్చ్ ప్రాజెక్టులు వంటివి ఏర్పాటు చేయాలని, అకడమిక్, పరిపాలన అంశాల్లో వర్సిటీలు ప్రగతి సాధించాలని, నైపుణ్య విద్య అందించే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

ఉత్తరాంధ్రులను మోసగించారు

శ్రీకాకుళం : ప్రధాని మోదీ చేపట్టిన విశాఖపట్నం పర్యటన ఉత్తరాంధ్ర ఆంధ్రప్రజానీకాన్ని మళ్లీ మోసం చేసినట్లయిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఏ.అజాశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర కూటమి నాయకులు ఒకరినొకరు పొగడ్తలతో సరిపెట్టుకున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్ ఊసే ఎత్తకుండా దాటవేశారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యే క హోదా, వెనుకబడ్డ జిల్లాకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీని పూర్తిగా మరిచిపోయారన్నారు. ప్రజలు వద్దు మొర్రో అంటున్న బల్క్ డ్రగ్ ప్లాంట్ శంకుస్థాపన ఎవరికోసమని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి వెనకబెట్టిన రైల్వేజోన్ శంకుస్థాపనలో గర్వపడడానికి ఏముందన్నారు. విశాఖ ప్రజల తరఫున గొంతు వినిపించాల్సిన వామపక్ష నాయకులను నిర్బంధించటం ప్రజాస్వామ్యమేనా అని ప్రశ్నించారు.

ఇబ్రహింబాద్‌లో కొట్లాట

ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో సమీప బంధువుల మధ్య సివిల్ తగాదా గురువారం కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో గాయపడిన సీపాన రాజశేఖర్ శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు బాధితుడు ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి వర్గాలు వివరాలను ఎచ్చెర్ల పోలీసులకు పంపించారు.

90 మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురం గ్రామానికి చెందిన బగ్గు ఈశ్వరరావు గురువారం అక్రమంగా మద్యం తరలిస్తుంగా ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. కొంగరాం సమీపంలో బైక్‌పై వెళ్తుండగా 90 బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

నాటుబాంబు పేలి వ్యక్తికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట పంచాయతీ పరిధిలో గురువారం నాటుబాంబు పేలి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. అడవి పందులను మట్టుబెట్టడానికి నాటుబాంబును తయారు చేస్తుండగా వ్యక్తి చేతిలో పేలడంతో నాలుగు వేళ్లు తెగి పడినట్లు తెలుస్తోంది. గాయపడిన వ్యక్తిని పలాసలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

వాహనచోదకులకు తప్పిన పాట్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాలకొండ రోడ్డులో చెట్ల తొలగింపుతో ఇబ్బందులు పడిన వాహనచోదకులకు గురువారం ఉపశమనం లభించింది. పండుగ పూట ఇవేం పనులు పేరిట సాక్షిలో గురువారం కథనం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారున. తెల్లవారేసరికి పనులు ప్రారంభించి షాపులు తెరిచే సమయానికి చెట్లు, వ్యర్థాలు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు. మరోవైపు, డివైడర్ల మధ్య ఐరన్ తీసుకెళ్లారని తెలియడంతో స్క్రాప్ షాపుల్లో తనిఖీలు చేపట్టి తిరిగి తీసుకొచ్చినట్లు కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ తెలిపారు.

రసూల్‌గఢ్ హత్య కేసులో మరో ఇద్దరు అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

భువనేశ్వర్: స్థానిక రసూల్‌గఢ్ స్క్వేర్ సమీపంలో బుధవారం జరిగిన యువకుడి హత్య కేసులో మరో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ హత్య సంఘటనలో నిందితుల సంఖ్య 5కి పెరిగింది. ఈ విషయాన్ని నగర డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) పినాక్ మిశ్రా గురువారం తెలిపారు. ఈ హత్యా సంఘటనలో పోలీసు వలంటీర్ సహదేబ్ నాయక్ (36) మృతునిగా గుర్తించిన విషయం తెలిసిందే. అరెస్టయిన నిందితుల్లో కేదార్‌పల్లికి చెందిన లక్కీ అలియాస్ లక్ష్మి నాయక్, రాకేష్ నాయక్ అలియాస్ ఒండాగా ఉన్నారు. ఈ హత్య సంఘటన నగరంలో తీవ్ర సంచలనం రేపింది. నిందితుల్ని స్వల్ప నిడివిలో అరెస్టు చేయాలనే దృక్పథంతో 3 ప్రత్యేక బృందాల్ని రంగంలోకి దింపినట్లు డీసీపీ పినాక్ మిశ్రా విలేకరుల సమావేశంలో వివరించారు. కేసు విచారణలో హత్యాకాండకు ఉపయోగించిన వాహనాలను గుర్తించారు. నిందితులను లోతుగా విచారించడంతో మిగిలిన నిందితుల ఆచూకీ కనుగొనడం సాధ్యమైంది. తొలుత ఇద్దరు నిందితుల్ని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. వీరి సమాచారం ఆధారంగా మిగిలిన ముగ్గురిని నయాగఢ్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఇలా అంచెలంచెలుగా మొత్తం 5 మందిని విచారించడంతో నేరారోపణ బలపడడంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతుంది. మరిన్ని ఆధారాలతో ఇంకొంత మంది అరెస్టు అయ్యే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. రసూల్‌గఢ్ హత్యాకాండలో ప్రయోగించిన పలు వస్తువులను పోలీసుల దర్యాప్తు బృందం స్వాధీనం చేసుకుంది. వీటిలో 2 మోటార్ సైకిళ్లు, హత్యకు ఉపయోగించిన రక్తపు మరకలున్న 2 కత్తులు, నిందితులకు చెందిన 4 మొబైల్ ఫోన్లు, రక్తపు మరకలు పడిన 2 సంచులు ఉన్నట్లు డీసీపీ పేర్కొన్నారు. రద్దీగా ఉండే రసూల్‌గఢ్ స్క్వేర్ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై బైక్‌పై వచ్చిన దుండగులు కత్తితో దాడికి పాల్పడి సహదేవ్ నాయక్ తల నరకడంతో హత్యకు గురయ్యాడు. రక్తపు మడుగులో బాధితుని వదిలేసి నిందితులు ఘటనా స్థలం నుంచి పారిపోయారు. బ్రౌన్ షుగర్ లావాదేవీలతో బలపడిన కక్షలతో ఈ హత్యకు ఆగంతకులు పాల్పడినట్లు ప్రధాన ఆరోపణ.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎచ్చెర్ల: విజేతలుగా నిలిచిన వెంకటాపురం విద్యార్థులు



జి.సిగడాం: జాడ పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: రణస్థలం మండలం జేఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహించిన ఎచ్చెర్ల నియోజకవర్గ అంతర పాఠశాలల గ్రిగ్స్ పోటీలలో లావేరు మండలం వెంకటాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బ్యాడ్మింటన్ జూనియర్ బాలిక విభాగంలో ఎస్.పూజిత, ఎల్.జయలక్ష్మీ, టెన్నికోయిట్‌లో ద్వితీయ స్థానంలో ఎస్.పూజిత, పి.పూజిత విజయం సాధించారు. బ్యాడ్మింటన్ జూనియర్ బాలురు విభాగంలో డి.ఉదయ్, జి.ధనుష్, సీనియర్ బాలికల విభాగంలో ఎం.రాజేశ్వరీ, ఎం.మేఘన విజేతలుగా నిలిచారు. సీనియర్ బాలురు విభాగంలో డి.వంశీ, జె.దినేష్‌లు, టెన్నికాయిట్ విభాగంలో డి.వంశీ, ఎస్.తరుణ్‌లు విజయం సాధించారు. విజేతలను హెచ్‌ఎం ఎస్.అరుణకుమారి, పీడీ పి.సూర్యారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

జి.సిగడాం: రణస్థలం మండలంలో ఇటీవల డివిజన్ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో జాడ ప్రాథమికోన్నత పాఠశాల బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించారు. వీరిని హెచ్‌ఎం బెవర రామినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.వెంకటనాయుడు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.



ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడాకారులను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: పాండిచ్చేరిలో ఈ నెల 11 నుంచి జరగనున్న జాతీయ స్థాయి సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు కేశవరావుపేట ఉన్నత పాఠశాలకు చెందిన పొందూరు హరికృష్ణ, గురుగుబెల్లి దుర్గాప్రశాంతి, పొందరు లావణ్య ఎంపికయ్యారు. వీరిని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, సెక్రటరీ చిగిలిపెల్లి లక్ష్మీదేవి, హెచ్‌ఎం బి.వి.సాయిరాం, పీడీలు ఎం.వి.రమణ, జి.మల్లేష్ గురువారం అభినందించారు.

కొబ్బరిలో సస్యరక్షణకు జీవ నియంత్రణ పద్ధతులు

రణస్థలం: కొబ్బరిలో పంటకు హాని చేసే పురుగుల నివారణకు జీవ నియంత్రణ పద్ధతులు ఉపయోగపడతాయని అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విశాలక్షి అన్నారు. గురువారం మండలంలోని వెంకట్రావుపేటలో నిర్వహించిన జీవ నియంత్రణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కొబ్బరిని ఆశించే రుగోస్ తెల్లదోమ నివారణకు 2018లో ఎంకార్షియా గడలోపే అనే బదానికలను కొబ్బరి తోటల్లో ప్రవేశపెట్టి ఐసీరియా అనే జీవ శిలీంధ్ర నాశిని పిచికారీ చేయడం వల్ల ప్రస్తుతం చాలా కొబ్బరి తోటల్లో ఇవి విస్తరించి తెల్ల దోమను నివారించాయని తెలిపారు. బెంగళూరు నుంచి విచ్చేసిన శాస్త్రవేత్త డాక్టర్ సెల్వరాజ్ మాట్లాడుతూ సామూహికంగా రైతులందరూ నివారణ చర్యలు చేపట్టడం వల్ల తెల్ల దోమ పురుగును ఆదుపులో ఉంచవచ్చని జీవ నియంత్రణ విధానాలు పాటించాలని కోరారు. అలాగే మిత్ర పురుగులను పొలంలో వదిలే విధానాన్ని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ చిట్టిబాబు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అనూష, హార్టికల్చర్ ఎం.అనూష, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆర్.హరిబాబు, ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, ఆర్.దేవుడుబాబు, బి.మూర్తి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

అర్జీలపై నిర్లక్ష్యమెందుకు?



హాజరైన రెవెన్యూ అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- రెవెన్యూ, సర్వే సిబ్బంది తీరుపై కలెక్టర్ అసంతృప్తి
- వీఆర్‌వోల గైర్హాజరుపై అసహనం
- 24 సబ్జెక్టుల్లో కేవలం 8 అంశాలే పైనే చర్చ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, సర్వే విభాగాల్లో రైతులు పెట్టుకున్న అర్జీల పరిష్కారం ఆలస్యం అవుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని, ఈ తీరు మారాలని అన్నారు. అధికారుల తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలసత్వానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా సిబ్బంది పెద్దగా హాజరు కాకపోవడంతో కలెక్టర్ సమావేశం ప్రారంభించకుండానే వెళ్లిపోయి, తిరిగి రెండు గంటలకు ప్రారంభించారు. అయితే రోజంతా జరగాల్సిన ఈ సమావేశంలో 24 రెవెన్యూ, సర్వే అంశాలపై సమీక్ష జరగాల్సి ఉండగా సిబ్బంది హాజరు కాకపోవడంతో కేవలం 8 అంశాలపై మాత్రమే సమీక్షించారు. కొంతమంది రెవెన్యూ అధికారులు పూర్తి సమాచారంతో రాకపోవడంతో కలెక్టర్ వారిపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఒక దశలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అందరినీ సస్పెండ్ చేయాలని, అప్పుడే మార్పు వస్తుందని అన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలకు రశీదులు ఇవ్వాలని, అర్జీలను ఆన్‌లైన్ చేయాలని, అర్జీదారుల ఫోన్ నంబర్లను సరిగ్గా నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం గురించి తెలుసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎం.అప్పారావు, బి.పద్మావతి, లావణ్య, ఆయా మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు హాజరయ్యారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

శ్రీకాకుళం అర్బన్: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, పార్లమెంట్ సభ్యుడు మాణిక్యం ఠాగూర్ డిమాండ్ చేశారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పర్యటన విచ్చేసిన ఆయన గార మండలం అంబటివానిపేటలో జై బాపూజీ.. జై భీమ్.. జై సంవిధాన్.. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారతదేశ ప్రజలకు భగవద్గీత లాంటి పవిత్రమైన రాజ్యాంగాన్ని, రాసిన అంబేడ్కర్‌ను కించపరుస్తూ అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి షేక్ మస్తాన్‌వలి, గిడుగు రుద్రరాజు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు, మమతా నాగిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జ్ గాధం వెంకటరమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రెల్ల సురేష్, కేవీఎల్ఎస్ ఈశ్వరి, తెంబూరు మధుసూదన్‌రావు, పూడి కిరణ్‌కుమార్, నియోజకవర్గాల ఇన్‌చార్జులు చక్రవర్తి రెడ్డి, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి అగ్రనేతలు శ్రీకాకుళం జిల్లా పర్యటనకు రాగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గత ఎన్నికల్లో పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన వారు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. దీనికి కారణం పార్టీలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలేనని చెబుతున్నారు. గైర్హాజరైన వారిలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు సనపల అన్నాజీరావు, మంత్రి నరసింహమూర్తి, కొప్పురోతు వెంకటరావు, కరిమజ్జి మల్లేశ్వరరావు, కోత మధుసూధనరావు, చింతాడ దిలీప్, కొర్రాయి ప్రసాదరావు, కె.శైలజ ఉన్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

విజయనగరం అర్బన్: జిల్లా కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్–2025ను గురువారం తన చాంబర్‌లో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గండిపల్లి మహేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి పలికల శీను, సభ్యులు బి.కిశోర్, ఏపీ చంద్రశేఖర్, ఈశ్వర్, ఎ.మాధవ్, దారా వెంకట్, కె.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కైలాస్ భూమిలో గ్యాస్ బర్నర్‌కు రూ. 2 లక్షల విరాళం

విజయనగరం టౌన్: రోటరీ సెంట్రల్ కైలాస్ భూమిలో గ్యాస్ బర్నర్‌కు ప్లాట్‌ఫామ్ నిర్మాణ నిమిత్తం జిల్లాకు చెందిన ఎస్‌కేవీపీ ఎస్ఎస్ఎన్.వాసురాజు రూ. 2 లక్షలు విరాళం అందజేశారు. ఈ మేరకు విరాళం చెక్కును కైలాస్ భూమి చైర్మన్ టీఎల్ఎన్.మూర్తి, కోశాధికారి ఆర్.శంకర్‌రెడ్డి, సభ్యులు పూసర్ల మారుతిలకు గురువారం కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ సెంట్రల్ క్లబ్ చేస్తున్న సర్వీసెస్‌లో భాగంగా రోటరీ హెల్త్ సెంటర్ ద్వారా రూ.10లకే విజయనగరంలో ఆరోగ్య సేవలందిస్తున్నామని, అవసరమున్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

5 లీటర్ల సారాతో పట్టుబడిన మహిళకు రిమాండ్

కొత్తవలస: మండలంలోని రామలింగాపురంలో సారా తయారీ శిబిరంపై ఎక్సైజ్‌శాఖ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై రమశ్రీ తన సిబ్బందితో కలిసి గురువారం దాడులను నిర్వహించారు. అదే సమయంలో 5 లీటర్ల సారాతో గ్రామానికి చెందిన సిమ్మ వరలక్ష్మి పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు నిందితురాలిని అదుపులోకి తీసుకుని సారా సీజ్ చేసి కేసు నమోదు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పరచగా ఆమెకు రిమాండ్ విధించడంతో విశాఖపట్నం సెంట్రల్‌జైల్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. అలాగే ముసిరాం గ్రామం సమీపంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది హెచ్‌సీ టి.వీర్రాజు, బి.రాముడు, ప్రసాద్, బి.ఆదినారాయణ, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు సంభవిస్తే చర్యలు

- కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: మాతాశిశు మరణాలు సంభవిస్తే, సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ వైద్యాధికారులను హెచ్చరించారు. గడిచిన ఐదునెలల్లో జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 10 మాతామరణాలు, ఆరు శిశు మరణాలపై కేసుల వారీగా వివరాలను తెలుసుకున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో విస్తృత స్థాయి యంత్రాంగం పనిచేస్తోందని చెప్పారు. అయినప్పటికీ మరణాలు సంభవించడం బాధాకరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందిని చైతన్య పరచడం ద్వారా గర్భిణులు, శిశువులపై పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా తీసుకునే విధంగా, ఇస్తున్న మందులు సక్రమంగా వాడేలా చూడాలన్నారు. దీనికోసం వైద్యారోగ్య శాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖలు తమ కిందిస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం పెరిగేలా చూడాలని చెప్పారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో తరచూ తనిఖీలు నిర్వహించారు. చిన్న వయస్సులో గర్భాలను నిరోధించేందుకు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. జీవనరాణి,

- ఫేస్‌బుక్, రీల్స్, వాట్సాప్‌తో సమయం వృథా చేయవద్దు
- సమీపిస్తున్న టెన్త్, ఇంటర్ పరీక్షల గడువు
- పరీక్షలు రాయనున్న 28,205 మంది విద్యార్థులు
- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్న నిపుణులు


పరీక్షలకు సన్నద్ధమవుతున్న ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు

పరీక్షల వేళ.. ఫోన్ ముట్టవద్దు

సీతంపేట: సామాజిక మాధ్యమాలు రెండు వైపులా పదునైన కత్తిలాంటివి. ఆశయం దిశగా సాగితే విజ్ఞానం, వినోదం ఉంటాయి. ఏ మాత్రం గురితప్పినా జీవితాలు తారుమారవుతాయి. టెన్త్, ఇంటర్మీడియట్ తుది పరీక్షలు జరగడానికి తక్కువ సమయమే ఉంది. సంక్రాంతి సెలవుల తర్వాత పూర్తిగా పరీక్షల సమయమే. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాల్సి ఉంది. ఇలాంటి సమయంలో మొబైల్ వినియోగం వల్ల భవిష్యత్తు పక్కదారి పట్టే అవకాశం ఉంటుందని పలువురు విద్య, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పరీక్షలపైనే దృష్టిసారించా లని సూచిస్తున్నారు. దీనిపై సాక్షి ప్రత్యేక కథనం..

ఫేస్‌బుక్ పేరు వింటేనే అందరిలో ఉత్సాహం మొదలవుతుంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఫేస్‌బుక్ దగ్గరైపోయింది. యువత విషయంలో చెప్పాల్సిన అవసరమే లేదు. ఖాతా తెరవడం కూడా పెద్దకష్టమేమీ కాదు. జిల్లాలో దీని వినియోగం విపరీతంగా పెరిగింది. పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఫేస్‌బుక్, రీల్స్ ఇతర సామాజిక మాధ్యమాల వినియోగం ఎక్కువైతే విద్యార్థులు అనుకున్న ఆశయాలను చేరుకోలేరు. ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే మొదటికే మోసం వస్తుంది. జిల్లావ్యాప్తంగా పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు 10,802 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 17,403 మంది, మొత్తం 28,205 విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి నుంచి టెన్త్ పరీక్షలు మార్చి 17 నుంచి జరగనున్నాయి.

మానసిక రుగ్మతలు..

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, రీల్స్ వాట్సాప్ ఇతర సామాజిక మాధ్యమాలకు అలవాటు పడితే మానసిక రుగ్మతలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలామందికి సోషల్ మీడియా వ్యవసనంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు. తమ పోస్టులకు ఎన్నిలైక్‌లు, కామెంట్లు వచ్చాయంటూ తరచూ చూస్తుండడం యువతను వేధిస్తున్న ప్రధాన సమస్య. వ్యతిరేకంగా కామెంట్లు వస్తే ఆత్మనూన్యతా భావానికి లోనవుతున్నారు. కొంతమంది విద్యార్థుల ఇలా చదువుల్లో కూడా వెనుకబడుతున్నారు.

ప్రమాదాలు అంతకుమించి..

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి ఖాతాలు ఉంటే మనస్సుకు నచ్చిన చిత్రాలను చిటికెలో పోస్టు చేయవచ్చు. లైక్‌లు,కామెంట్లు, షేర్‌లు కోరవచ్చు. సమాచారాన్ని పంచుకోవచ్చు. ఖాతాలు వెల్లడించవచ్చు. వ్యాపార, ఉద్యోగ అభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు. సామాజిక చైతన్యం తీసుకువచ్చేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఏది చేసినా చట్టానికి లోబడి ఉండాలి. ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన అపరిచిత మిత్రులు విందు, వినోదాలకు పిలిస్తే వెళ్లడం, డబ్బు లావాదేవీలు జరపడం, ఫొటోలను ఇచ్చిపుచ్చుకోవడం చేయడం మంచిదికాదు. ఫొటోలు వివాదాస్పద కామెంట్ల విషయంలో దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. వ్యక్తిగతంగా, స్వతంత్రంగా వ్యతిరేక కామెంట్లు చేయడం ప్రమాదం. ఎదుటివారి చిత్రాలను వారి అనుమతితో మాత్రమే పెట్టాలి.

మీ స్థితిని ఇలా పరీక్షించుకోండి

సామాజిక మాధ్యమాలను రోజుకు 30 నిమిషాలు మించి వినియోగిస్తే ఇబ్బందులు లేవని వైద్యనిపుణులు అంటున్నారు. చాలామంది గంటల తరబడి అందులోనే గడిపేస్తున్నారు. ప్రతిరోజూ వాటిని వినియోగించి ప్రస్తుతం పరీక్షలకు దగ్గరకు వచ్చే సమయంలో ఆ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నారు. అలాంటి వారు తమకు తామే పరీక్ష పెట్టుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రతి పదినిమిషాలకు ఒకసారి ఫోన్ వైపు చేయి వెళ్తోందా? సామాజిక మాధ్యమాలను చూడాలనిపిస్తోందా?, అన్న విషయం తమకు తామే పరిశీలించుకోవాలి. పరిస్థితి చేయిదాటినట్లయితే వారం పదిరోజులు వాటికి దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఇలా ఉండగలిగితే నియంత్రణలో ఉన్నట్లే లెక్క. ఉండలేక పోతున్నారంటే వాటికి బానిస అవుతున్నట్లే.

ప్రతి నిమిషం విద్యార్థికి విలువైనది



విద్యార్థి జీవితంలో ప్రతి నిమిషం విలువైనది. అందునా పది, ఇంటర్ విద్యార్థులకు ఇంకా ముఖ్యమైనది. చదువులపై దృష్టి సారించాలి. సమయాన్ని వృథా చేయవద్దు. సోషల్ యాప్‌లకు అలవాటు పడుతున్న ఫలితంగా చదువులు పక్కదారి పడుతున్నాయి. మొబైల్ అవసరాన్ని మించి వినియోగిస్తూ కాలం వృథా చేయవద్దు. బానిసగా మారవద్దు.

పొట్నూరు కోటిబాబు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, సీతంపేట ఐటీడీఏ

కంటి చూపుపై ప్రభావం



ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాలకు వినియోగిస్తే కంటిచూపుపై ప్రభావం పడుతుంది. రెటీనా పార దెబ్బతినే అవకాశముంది. కళ్లు పొడిబారడం వల్ల ఎరుపెక్కుతాయి. నిద్రలేమి వల్ల తలనొప్పి కూడా వస్తుంది.

రామకృష్ణ, నేత్ర వైద్య నిపుణుడు, పాలకొండ ఏరియా ఆస్పత్రి

అతి వినియోగం అనర్థం



అతిగా మొబైల్ వినియోగం అనేక అనర్థాలకు దారి తీస్తుంది. ఇది వ్యసనంగా మారితే కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంది. ఒంటరితనం అలవడుతుంది. కుటుంబసభ్యుల అనురాగాలకు దూరమవుతారు. ప్రస్తుతం పరీక్షల వేళ చదువులపై దృష్టిసారించాలి. రాత్రి సమయాల్లో నిద్రలేకపోతే అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కావున యువత జాగ్రత్త వహించాలి.

సాయిచరణ్, వైద్యాధికారి, మర్రిపాడు పీహెచ్‌సీ

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు కొత్తవలస విద్యార్థిని ఎంపిక


జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పుష్పితగౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.పుష్పితగౌడ్ జాతీయ స్థాయి 68వ క్రికెట్ పోటీలకు అండర్–17 విభాగంలో ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు గురువారం తెలిపారు. డిసెంబర్ నెలలో జరిగిన స్కూల్‌గేమ్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన డిసంబర్–15వ తేదీన భువనేశ్వర్, రాజస్థాన్ జట్లతో ఆడి సెమీఫైనల్ లో పంజాబ్ జట్టుతో తలపడి మూడు జట్లతో ఆడి మొత్తంగా 252 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచినట్లు హెచ్‌ఎం తెలిపారు. జాతీయ స్థాయి జట్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపిక కాగా ఇందులో కొత్తవలస హైస్కూల్‌కు చెందిన పుష్పితగౌడ్ ఒకరు కావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థినిని శాలువాతో సన్మానించి పూలబొకేలతో సత్కరించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో పీఈటీలు పాప, కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయుడు గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ కార్యవర్గం ఎంపిక


కొత్తగా ఎంపికైన బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో అశోక్‌రాజు

శృంగవరపుకోట: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కార్యదర్శి ఇందుకూరు అశోక్‌రాజు ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. విజయనగరం సిటీ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ చైర్మన్‌గా జోలా మన్మథకుమార్ అధ్యక్షుడిగా గారే శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శిగా ఇందుకూరు ప్రకాశ్ రాజులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు చెప్పారు. వారు నాలుగేళ్ల పాటు పదవిలో ఉంటారన్నారు. 45 ఏళ్ల చరిత్రకలిగిన జిల్లా బాక్సింగ్ అసోషియేషన్ నియమావళి ప్రకారం నడుచుకుని జిల్లాలో బాక్సింగ్ క్రీడాభివృద్ధికి పాటుపడతామని ఆయన తెలిపారు.

దక్షిణ భారత స్థాయి పోటీలకు జిల్లా టీచర్ సైన్స్ ప్రాజెక్టు ఎంపిక


ఎంపిక పత్రాలను విజయవాడలో ఎస్పీడీ శ్రీనివాస్ నుంచి అందుకుంటున్న ఉపాధ్యాయుడు సీహెచ్ ఉమామహేశ్వరరావు

విజయనగరం అర్బన్: దక్షిణ భారతదేశ స్థాయిలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే సైన్స్ ఫెయిర్ పోటీలకు రాష్ట్రం తరఫున పాల్గొనే టీచర్ కేటగిరి ప్రాజెక్టుల్లో జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సీహెచ్ ఉమామహేశ్వరరావు ప్రాజెక్టు ఎంపికైంది. విజయవాడలో ఈ నెల 7, 8వ తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయ సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో ప్రతిభ చూపిన ప్రాజెక్టుగా గుర్తించి ఎంపిక చేసినట్లు ఆ టీచర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. డిజిస్కోప్ పేరుతో రూపొందించిన ఈ ప్రాజెక్ట్ ఒక డిజిటల్ మైక్రోస్కోప్‌గా పనిచేస్తుందని పేర్కొన్నారు. దీనిని మూడు రకాల పద్ధతుల్లో వాడడం ద్వారా వైద్యారోగ్య రంగంలోనే కాకుండా పారిశ్రామిక రంగంలో లోహాలు, స్ఫటికాలు, పాలిమర్స్ మొదలైన వాటిపై అధ్యయనం చేయవచ్చని తెలిపారు. ఈ పరికరం తయారీకి రూ.లక్ష వరకు వ్యయం అవుతుందని, ఆరో తరగతి నుంచి రీసెర్చ్ స్కాలర్ వరకు ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు రామతీర్థంలో ముక్కోటి ఏకాదశి పూజలు

- ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం
- గిరిప్రదక్షిణ చేయనున్న భక్త జనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు


స్వామివారి ఉత్సవ విగ్రహాలు


రామతీర్థం ఉత్తర రాజగోపురం (ఈ మార్గం నుంచే స్వామివారి దర్శనం)

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ముస్తాబైంది. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, మెట్లోత్సవం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహించడానికి ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకే రోజు గిరిప్రదక్షిణ, మెట్లోత్సవం నిర్వహించడం వల్ల అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఉదయం 3గంటలకు స్వామివారికి ఆరాధన, 4గంటలకు తిరుప్పావై సేవాకాలం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి నిర్వహించనున్నారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ శుక్రవారం వేకువజామున 5గంటలకు స్వామివారి ఉత్తర ద్వారదర్శనం కార్యక్రమాన్ని జరపనున్నారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. పవిత్రమైన కొండ మెట్లను శుభ్రపరిచి శిఖరంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. నీలాచలం కొండపైకి వెళ్లేందుకు ఉన్న మెట్ల వద్ద వందలాది మంది భక్తులు, కళాకారులతో మెట్లోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు మజ్జిగ, మంచినీరు, ప్రసాదాల పంపిణీకి ఆలయ సిబ్బంది, దాతలు సిద్ధమవుతున్నారు. భక్తుల రద్దీ దష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నెల్లిమర్ల పోలీసులు కొండ చుట్టూ బందోబస్తు నిర్వహించనున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల కనకం(40) ప్రమాదవశాత్తు గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు. ఈ నెల 7వ తేదీన గ్రామంలో నడుస్తూ సీసీ రోడ్డుపై ఒక్కసారిగా పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో కుటుంబసభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితి కుదుటపడకపోవడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రామలక్ష్మితో పాటు 5వ తరగతి,3వ తరగతి చదువుతున్న పాప, బాబు ఉన్నారు.


అమిత్‌షా వ్యాఖ్యలు అమానుషం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మానిక్కం ఠాగూర్
- అంబేడ్కర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్


మాట్లాడుతున్న ఠాగూర్

నెల్లిమర్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అమానుషమని కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మానిక్కం ఠాగూర్ అన్నారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నవ సత్యాగ్రహం పేరుతో నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలో గురువారం ఆందోళన నిర్వహించారు. స్థానిక రామతీర్థం జంక్షన్, ఇందిరా కాలనీలోని అంబేడ్కర్ విగ్రహాలకు పార్టీ సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, పీసీసీ స్పోక్స్ పర్సన్ మస్తాన్ వలీతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమిత్ షా రాజీనామా పత్రాన్ని పాదాల వద్ద ఉంచారు. ఈ సందర్భంగా మానిక్కం ఠాగూర్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానిస్తూ అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. రుద్రరాజు, మస్తాన్ వలీ మాట్లాడుతూ రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్న వ్యక్తులు అంబేడ్కర్‌ను అవమానించడంపై ధ్వజమెత్తారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పకపోతే 26 నుంచి ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, నాయకులు గంటా సత్యనారాయణ, సతీష్, గేదెల తిరుపతి, తారకేశ్వరరావు, రాయల సురేష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారం అండ ఉంటే.. ‘అధికారి’ పీఠం మనకే!



సాక్షి, పార్వతీపురం మన్యం: జిల్లాలో అధికారి పోస్టు కావాలా.. ఆ ప్రజా ప్రతినిధి ఆశీస్సులు మీకు ఉండాల్సిందే. మీరు సీనియర్, జూనియర్ అన్న భేద అవసరం లేదు. మీరు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పని చేయడమే ప్రధాన అర్హత. జిల్లాలో పలువురు అధికారుల నియామకాల్లో కూటమి ప్రజా ప్రతినిధుల మార్కు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా ఓ ప్రజా ప్రతినిధి అండదండలు ఉంటే నచ్చిన పోస్టు వస్తుందన్న వాదనలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఓ జిల్లా పోస్టులో ఉన్న అధికారిని మార్పు చేసి, కొత్తగా మరొకరిని నియమించారు. ఈ పోస్టు కోసం సుమారు రూ.15 లక్షల వరకూ చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధి ఆశీస్సులు దీనికి అదనం. మరో అధికారి కొన్నాళ్లపాటు అంతా తానై చక్రం తిప్పారు. సదరు అధికారి మీద ఎన్ని ఆరోపణలు వస్తున్నప్పటికీ ఆయన హవా మాత్రం తగ్గలేదు. అందుకు కారణం రాజకీయ అండదండలు అనే విమర్శలు ఉన్నాయి. ఇలా కీలక విభాగాల్లో అంతా తమవారే ఉండేలా ప్రజా ప్రతినిధులు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో డబ్బు, పలుకుబడి కీలకంగా మారుతోంది.

గిరిజన సంక్షేమ శాఖ డీడీ పోస్టులో టీడీపీ నేత సతీమణి

తాజాగా గిరిజన సంక్షేమ డీడీ పోస్టును ఓ టీడీపీ నేత సతీమణికి ఇవ్వడంపై గిరిజన సంఘ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే సీటును కృష్ణబాబు ఆశించారు. అధిష్టానం తోయక జగదీశ్వరి వైపు మొగ్గు చూపింది. అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవి ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యేగా జగదీశ్వరి విజయం కోసం ఆయన పని చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయింది. దీంతో ఆయన సతీమణి కృష్ణవేణికి జిల్లాలో కీలక పోస్టు ఇప్పించింది. ఆయనను ఆ విధంగా బుజ్జగించారని సొంత పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా ఉన్న కృష్ణవేణిని సాలూరు సహాయ గిరిజన సంక్షేమ అధికారిగా (ఎఫ్ఏసీ) నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మరలా ఆమెకే గిరిజన సంక్షేమ డీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ బాధ్యతలూ ఆమెకే అప్పగించారు. ఇలా ఒక్కరికే మూడు పోస్టులు కేటాయించడంపై అధికారవర్గాల్లోనే విస్మయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి గతంలో రెగ్యులర్ డీడీగా రుక్మాంగదయ్య పని చేసినప్పుడే కృష్ణవేణి డీడీగా వస్తారన్న ప్రచారం ఐటీడీఏలో సాగింది. కొద్ది రోజులకే రుక్మాంగదయ్యను సరెండర్ చేయడం.. ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. ఇప్పుడు అంతా భావించినట్లే టీడీపీ నేత సతీమణిని ఆ స్థానంలో కూర్చోబెట్టారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధి అండ.. కూటమి ప్రభుత్వం ఆశీస్సులతోనే మొత్తం కథ అంతా నడిచిందని గిరిజన, ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి.

ఏనుగుల గుంపును తరలించండి మహా ప్రభో..!

కొమరాడ: ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటలు చేతికందే సమయంలో ఏనుగుల గుంపు నాశనం చేస్తున్నాయని కొమరాడ మండలంలోని రాజ్యలక్ష్మీపురం, కందివలస, కుమ్మరిగుంట, స్వామినాయుడువలస, గంగారేగువలస రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో జంఝావతి డ్యాం దాటిన ఏనుగుల గుంపు పాతకంబవలసకు చేరుకున్నాయి. అక్కడ రాజ్యలక్ష్మీపురం గ్రామానికి చెందిన బొండపల్లి నాగరాజు అనే రైతు రెండు ఎకరాల వరి చేను నూర్పిడి చేసి గోనెల్లో ఉంచిన ధాన్యంను చెల్లాచెదురుగా విసిరేశాయి. విక్రయించేందుకు సిద్ధం చేసిన ధాన్యంను ధ్వంసం చేయడంతో రైతు ఆవేదన చెందుతున్నాడు. పంటకొచ్చిన టమాటా తోటల్లో ఏనుగుల సంచారంతో పంటంతా నాశనం అవుతోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, స్థానిక పాలకులు స్పందించి ఏనుగుల గుంపును తరలించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


పాతకంబవలసలో ఏనుగులు ధ్వంసం చేసిన ధాన్యం ఇలా..

తిరుపతి ఘటనకు చంద్రబాబే బాధ్యుడు

- మృతుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం చెల్లించాలి
- కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్సీ విక్రాంత్


వీరఘట్టంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వీరఘట్టం: కూటమి ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటం తప్ప ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మండిపడ్డారు. వీరఘట్టం వచ్చిన ఆయన మీడియాతో గురువారం మాట్లాడారు. 2015లో గోదావరి పుష్కరాల పేరిట ఆర్భాటం చేసిన అప్పటి సీఎం చంద్రబాబునాయుడు 29 మంది ప్రాణాలు పోయేందుకు కారకులయ్యారని, నేడు అదే ప్రచారయావతో తిరుపతిలో ఆరుగురి అమాయకుల ప్రాణాలు పోయేందుకు బాధ్యుడయ్యారన్నారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగినది కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన బలవన్మరణాలుగా పేర్కొన్నారు. తిరుపతి చరిత్రలో ఏనాడు జరగని దుర్ఘటన ఇలా జరగడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూ విషయంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఏ దీక్ష చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మీ పాపాలకు, మోసాలకు ప్రజల ప్రాణాలను బలికొంటున్నారని దుయ్యబట్టారు. గోవిందా గోవిందా అని భక్తుల నోట వినాల్సిన తిరుమల నేడు ఆర్తుల ఆర్తనాదాలతో భయానకంగా మారిందన్నారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. క్షతగాత్రుల ఆరోగ్యం తొందరగా కుదుటపడాలని కోరారు. విశాఖపట్నానికి వచ్చిన ప్రధాని మోదీ వద్ద రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం ఎందుకు ప్రస్తావించలేదని కూటమి నాయకులను విక్రాంత్ ప్రశ్నించారు. ప్రధాని మోదీ పర్యటనతో విశాఖపట్నంకు ఎటువంటి ఉపయోగం కనపడలేదన్నారు. మోదీ పర్యటనలో సుమారు గంటన్నర సేపు జరిగిన ప్రసంగాల్లో కనీసం స్టీల్‌ప్లాంట్ ప్రస్తావన తేలేదన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం నోట ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశం ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు. ఎంతసేపూ మోదీకి భజన చేయడం తప్ప వేరే అంశం ఈ సభలో కనిపించలేదన్నారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి లీలాప్రసాదరావు, దిబ్బ లలితకుమారి, బూరాడ చిన్న, బొత్స ప్రకాశరావు, భోగి మణి, కెంగువ ఆంజనేయులు, పిన్నింటి శ్రీను, సైల సుహాష్, పిన్నింటి దుర్గారావు, మెండి తవుడు, సాయిచంద్, కలిపిల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.